

మద్దిపాడులోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సంతనూతలపాడు: రంజాన్ ప్రార్థనల్లో చిన్నారి వసీం అహ్మద్



ఒంగోలులోని ఈద్గాలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో భారీగా పాల్గొన్న ముస్లింలు



ఈతముక్కల ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వెల్లివిరిసిన భక్తిభావం

- భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు
- భారీగా పాల్గొన్న ముస్లింలు

ఒంగోలు టౌన్: రంజాన్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ముస్లింల ప్రత్యేక ప్రార్థనలతో భక్తిభావం వెల్లివిరిసింది. యా అల్లా.. దేశంలో సోదర భావాన్ని కాపాడు.. సామరస్యాన్ని, ఐక్యతను పెంపొందించు.. దేశ ప్రజలకు సుఖశాంతులు ప్రసాదించు అని కోరుతూ ఈద్గా మైదానాలలో ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. ఒంగోలు నగరంలోని కొణిజేడు బస్టాండు సెంటర్లో ఉన్న ఈద్గా మైదానంలో మౌలానా హుసేన్ దువా చేశారు. నగరంలోని ముస్లింలు, చిన్నపిల్లలు, యువకులు, వృద్ధులు భారీగా తరలిరావడంతో ఆర్పీ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. ఎటుచూసినా ముస్లింల హడావిడి కనిపించింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఆర్పీ రోడ్డు, గద్దలగుంట పరిసర ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా హుసేన్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. రంజాన్ విశిష్టతను, ఉపవాసాల ప్రాధాన్యతను వివరించారు. ఉపవాసం అంటే కేవలం ఆకలితో గడపడం కాదని, దేహంలోని అన్నీ భాగాలు ఉపవాసం పాటించడమే నిజమైన రోజా అవుతుందని చెప్పారు. రంజాన్‌లో ఎంత నిష్టగా ఉపవాసాలు, నమాజులు పాటించారో మిగిలిన 11 మాసాలు కూడా అంతే నిష్టతో గడపాలని చెప్పారు. పేదలు కూడా ధనవంతులతో సమానంగా పండుగ చేసుకునేందుకు ఫిత్రాను విధిగా పాటించేలా చేశారన్నారు. సమాజంలో పేదరికాన్ని రూపుమాపేందుకు జకాత్ ఇవ్వాలని ఆదేశించారన్నారు. మహమ్మద్ ప్రవక్త ఆదేశాలు పాటించడం ద్వారా ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో జీవించవచ్చని చెప్పారు. అనంతరం ఆయన దువా చేశారు. కులమతాలకతీతంగా దేశ ప్రజలందరికీ సుఖశాంతులను ప్రసాదించమని, ఆరోగ్యం, ఆనందం ఇవ్వమని అల్లాను వేడుకున్నారు. నమాజు తర్వాత ముస్లింలు ఈద్ ముబారక్ చెబుతూ ఒకరినొకరు అలాయ్ బలాయ్ చేసుకున్నారు.

మాంటిస్సోరి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం...

ఒంగోలు సిటీ: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఒంగోలులోని ఈద్గాలో సామూహిక ప్రార్థన ముగించుకుని వెళ్తున్న ముస్లింలకు స్థానిక మాంటిస్సోరి హైస్కూల్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. మాంటిస్సోరి కరస్పాండెంట్ ప్రకాష్ బాబు పాల్గొని సుమారు రెండువేల మందికి వివిధ రకాల పండ్లు, ఖర్జూరం, మంచినీరు అందించారు. స్కూల్ డైరెక్టర్ శబరీనాథ్, ప్రిన్సిపాళ్లు నూరుద్దీన్, నరేష్, రాజేష్, రవికిరణ్, మాంటిస్సోరి విద్యార్థులు పాల్గొన్నారు.



ఒంగోలులో ముస్లింలతో కలిసి రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు, నగర అధ్యక్షుడు కఠారి శంకర్



ముస్లింలు, మత పెద్దలతో వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు

కొత్తపట్నం మండలంలో ఘనంగా రంజాన్ వేడుకలు...

కొత్తపట్నం: మండలంలోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాసాలు ఉండి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తపట్నంలో మస్‌జీద్–ఎ–మహమూదీయ, అల్లూరులో మస్‌జీద్–ఎ–అహ్మదీయ, రంగాయపాలెంలో మస్‌జీద్–ఎ–నూర్, ఈతముక్కలలో మదీన–మస్‌దీన, మడనూరులో మదీన–మస్‌దీన, రాజుపాలెంలో మహ్మదీయ ఆయా మసీద్ ప్రవక్తలు దైవసందేశాన్ని అందించారు. ఈద్గాలో సమాజ్ చదివి దైవ సందేశమిచ్చారు. కొంత మంది ఇంటి దగ్గరే రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. ఒంగోలు నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ బాజీ, మసీద్ ప్రెసిడెంట్ సయ్యద్ బాబావలి, సెక్రటరీ పఠాన్ మహబూబ్‌ఖాన్, కోశాధికారి పటాన్ పాపాఖాన్, నజీర్, షేక్ సుభానీ, షేక్ నాగూర్‌బాషా, షేక్ గౌస్‌బాషా, ఎస్‌కే కరిముల్లా, జిలానీ, ఎస్‌కే వలి, షేక్ ఖాజావలి, షేక్ మస్తాన్‌వలి, ముస్లింలు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు: నెల రోజులుగా కఠిన నియమాలతో ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు సోమవారం పవిత్ర రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. సంతనూతలపాడులోని ఈద్గా వద్ద, మండలంలోని మైనంపాడు సమీపంలోని ఈద్గా వద్ద జరిగిన రంజాన్ ప్రార్థనల్లో ముస్లింలు భారీగా పాల్గొన్నారు. వస్తాదు ఫిరోజ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు ఆనందోత్సాహాలతో రంజాన్ వేడుకల్లో మునిగిపోయారు. ముస్లిం పెద్దలు సూచించిన విధంగా ఉపవాసాలతో పాటు ఈ నెలంతా పూర్తిగా ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. మసీదులకు వెళ్లి నమాజులు చేసి ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పేస్ ఇమామ్‌లు మాట్లాడుతూ ధార్మిక చింతన కలిగి అత్యంత కఠినమైన ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు సేవాభావంతో కూడా మెలగాలని, పేదలకు తమ వంతు సహాయం చేయాలని పిలుపునిచ్చారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలంతా ప్రత్యేక ప్రార్థనల అనంతరం పేదలకు తమ వంతు సాయం చేశారు. సన్నిహితులను పిలుచుకుని వారితో కలిసి భోజనాలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.



సంతనూతలపాడు : రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు





ఈద్గా వద్ద చిన్నారుల భక్తిభావం



ముస్లింలకు పండ్లు పంపిణీ చేస్తున్న మాంటిస్సోరి స్కూల్ కరస్పాండెంట్ ప్రకాష్‌బాబు

వైవీ మాతృమూర్తికి ఘన నివాళులు

రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ ఉత్తర క్రియలను సోమవారం ఒంగోలులో నిర్వహించగా, పలువురు ప్రముఖులు పాల్గొని ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. - సాక్షి, ఒంగోలు



యర్రం పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి దంపతులు



నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మారెడ్డి సుబ్బారెడ్డి



వైవీ సుబ్బారెడ్డితో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల, తదితరులు



పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, నాయకులు



పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు



వైవీతో మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కనకారావుమాదిగ, తదితరులు



వైవీ సుబ్బారెడ్డితో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు

మాజీ సర్పంచ్ కోడలికి మేరుగు నివాళులు



రవీంద్రమ్మకు నివాళులర్పిస్తున్న మేరుగు నాగార్జున

చీమకుర్తి రూరల్: మండలంలోని గాడిపర్తివారిపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ మాజీ సర్పంచ్ కోడలికి ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున సోమవారం ఉదయం నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీకి చెందిన గాడిపర్తివారిపాలెం మాజీ సర్పంచ్ జ్యోతి కోటయ్య పెద్ద కుమారుడు అంజయ్య భార్య రవీంద్రమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె మృతదేహానికి మేరుగు నాగార్జున నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, సర్పంచ్ సీహెచ్ అయ్యవారయ్య, నాయకులు ఎస్.వెంగారెడ్డి, సుబ్బరామిరెడ్డి, జి.ఓబులరెడ్డి, బొడ్డపాటి హరిబాబు, ఎస్.వెంకటరావు, రాములు, ఎర్రయ్య, రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల నాకాబందీ



వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, ఎస్సైలు

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మద్దిపాడు ఎస్సై శివరామయ్య సోమవారం నాకాబందీ నిర్వహించారు. గుంటూరు వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న వాహనాలను ఆపి డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ప్రభుత్వ వాహనాలను కూడా తనిఖీ చేయడంతో ఏదో పక్కా సమాచారం ఉండటంతోనే తనిఖీలు చేస్తున్నారని స్థానికులు చర్చించుకున్నారు. తనిఖీల్లో ఒంగోలు వన్‌టౌన్, టూటౌన్, తాలూకా పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సంతనూతలపాడు: మండలంలోని రుద్రవరం వాటర్ ట్యాంక్ వద్ద మాజీ ఎంపీపీ కూకుట్ల కోటయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు స్మార్ట్ విజన్ హాస్పిటల్ పర్యవేక్షణలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా కంటి శుక్లాలు, నీటి కాసులు, కంటి పొరలు, చిన్నపిల్లలకు కంటి సమస్యలపై పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు.

కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలి



ఈతముక్కల గ్రామ కమిటీతో లంకపోతు అంజిరెడ్డి, ఆళ్ల రవీంద్రరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

- కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి పార్టీని అభివృద్ధి చేయాలని, 2029 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని పార్టీ కొత్తపట్నం మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సంకువారిగుంట, ఈతముక్కల, మడనూరు గ్రామాల వైఎస్సార్ సీపీ నూతన కమిటీలను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నూతన కమిటీలు కృషి చేయాలన్నారు. కార్యకర్తల సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉండి సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అరాచకాలను కమిటీ సభ్యులు ఎండగట్టాలన్నారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకపోవడాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈతముక్కల సర్పంచ్ భర్త అర్జున్‌రావు, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి గాలి ముసలారెడ్డి, నాయకులు పఠాన్ నజీర్, సోషల్ మీడియా మండల కన్వీనర్ స్వర్ణ సుబ్బారావు, షేక్ బాజీ, నియోజకవర్గ చేనేత కార్మికుల అధ్యక్షుడు నాగరాజు, బద్దేల ప్రమోద్‌రెడ్డి, సామంతుల వీరారెడ్డి, తమలపాకుల రవీంద్ర, చక్రవర్తి, కట్టా శ్రీను, రాంబాబు, సుబ్రహ్మణ్యం, వాయల రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

యాచకులకు అల్పాహారం, వాటర్ బాటిళ్లు అందజేత

కొత్తపట్నం: ఆకలితో అలమటిస్తూ భిక్షాటన చేస్తున్న యాచకులకు సోమవారం అల్పాహారం, వాటర్ బాటిళ్లు అందజేశారు. స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చక్కా కోటేశ్వరరావు కుమారుడు చెక్కా రణదీప్ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, జాన్సీరాణి, హేమచందర్, మధుపాలు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలికి సన్మానం



అరుణకుమారి దంపతులను సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఒంగోలు సిటీ: ఉద్యోగ విరమణ పొందిన ఎయిడెడ్ ఉపాధ్యాయురాలు బి.అరుణకుమారిని స్థానిక అంబేడ్కర్ భవనంలో సోమవారం ఘనంగా సన్మానించారు. బసవన్నపాలెం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ అరుణకుమారి ఉద్యోగ విరమణ పొందారు. 42 సంవత్సరాల పాటు విద్యారంగానికి ఆమె అందించిన సేవలను పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరావు, ప్రభాకర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి కే రమేష్ సుధీర్, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ పదవిని ఎస్సీ, బీసీలకు కేటాయించాలి

సంతనూతలపాడు: మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ పదవిని ఎస్సీ, బీసీలకు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సంకె సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పడి సుమారు 50 సంవత్సరాలు పూర్తి కావస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఓసీలకు మాత్రమే చైర్మన్ పదవి ఇస్తున్నారన్నారు. ఈ పదవి విషయంలో రిజర్వేషన్లు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకి చెందిన అగ్రకుల నాయకులకు చైర్మన్ పదవి ఇస్తున్నారన్నారు. కేవలం డైరెక్టర్ల పదవులకు మాత్రమే ఎస్సీ, బీసీలను నియమిస్తున్నారన్నారు. గతంలో దీనిపై హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చినట్టు సుబ్బారావు వెల్లడించారు. ఇప్పటికైనా రిజర్వేషన్లు అమలు చేయాలని, లేనిపక్షంలో కోర్టుకు వెళ్తామని సుబ్బారావు హెచ్చరించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇకనైనా మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీ, బీసీలకు కేటాయించాలని కోరారు.